

హుండీ ఆదాయం రూ.2.17 కోట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. 14 రోజులకుగాను రూ.2.17 కోట్ల ఆదాయం లభించింది.



జిల్లా జడ్జితో కలెక్టర్ భేటీ

గుంటూరు వెస్ట్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తిని కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్జికి పుష్పగుచ్ఛం అందించారు.

అదనపు జిల్లా జడ్జితో..



నరసరావుపేట టౌన్: 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్. సత్యశ్రీని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కోర్టు కార్యాలయానికి వెళ్లి పూల మొక్క అందించారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పాలకులు చేసే తప్పులు, పొరపాట్లను ప్రజలకు చేరవేయడంలో పత్రికలది ప్రధాన పాత్ర. ప్రజాస్వామ్య పరిరక్షణలో అవి కీలకపాత్ర పోషిస్తాయి. ప్రభుత్వ అవినీతిని, పాలకుల వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజలకు వాస్తవాలను చేరవేస్తోందనే అక్కసుతో సాక్షిపై కక్ష సాధింపునకు దిగడం సరైన విధానం కాదు. సాక్షి ఎడిటర్, విలేకరులపై అక్రమంగా కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేసి వాస్తవాలను బయటకు రాకుండా చేయాలనే కుట్రను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమే. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పత్రికలపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యంలో సరైన విధానం కాదు.

– అంబటి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త



వాస్తవాలు రాస్తున్నారనే అక్రమ కేసులు



ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్న 'సాక్షి' పత్రికపై కూటమి ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతోంది. ప్రజల పక్షాన మాట్లాడే ప్రతిపక్ష నేతలను, 'సాక్షి'ని నోరు మూయించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. పత్రికలపై, విలేకరులపై అక్రమ కేసులు బనాయిస్తోంది. చంద్రబాబు పాలనలో చేసిందేమీ లేకపోయినా ఏదో అద్భుతాలు జరుగుతున్నట్లు ఎల్లో మీడియాలో చూపిస్తున్నారు. 'సాక్షి'లో వాస్తవాలు రాస్తున్నందున చంద్రబాబు బండారం ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసిపోతోంది.అందుకే 'సాక్షి' ఎడిటర్‌పై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. రాజ్యాంగంలో ఉన్న వాక్ స్వాతంత్రాన్ని కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. తప్పులను సరిచేసుకోకుండా కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం దిగడం సిగ్గుచేటు.

– డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్ రెడ్డి, సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

న్యూస్‌రీల్

330 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా



కొరిటెపాడు(గుంటూరు): జిల్లాకు గురువారం నర్మద కంపెనీకి చెందిన 330 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయింది. స్థానిక రెడ్డిపాలెం రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరింది. స్టాక్‌ను రేక్ పాయింట్ అధికారి, గుంటూరు ఏడీఏ ఎన్.మోహనరావు పరిశీలించారు. జిల్లాకు వచ్చిన 330 మెట్రిక్ టన్నుల్లో మార్క్‌ఫెడ్‌కు 250 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్స్‌కు 80 మెట్రిక్ టన్నులు సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు.

లాటరీ విధానంలో 26 బార్లు కేటాయింపు

ఇంకా మిగిలిపోయిన 41 బార్లు



నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో లాటరీ విధానం ద్వారా 26 బార్లు కేటాయించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గురువారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ సమక్షంలో ఎక్సైజ్ అధికారులు లాటరీ తీశారు. జిల్లాకు మొత్తం 110 బార్లు ప్రభుత్వం కేటాయించగా వీటికి గత నెల 30న లాటరీ తీశారు. అయితే, ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. అధికారులు 43 బార్లను మాత్రమే కేటాయించారు. మిగిలిన 67 బార్లకు తిరిగి ఈ నెల 3 నుంచి దరఖాస్తులు 14 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయినా ఆశించిన స్థాయిలో రాకపోవడంతో మరో మూడు రోజులు పెంచారు. 17వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించారు. గురువారం జేసీ చేతుల మీదుగా 67 బార్లకు గానూ 26కు మాత్రమే లాటరీ తీసి కేటాయించారు. ఇంకా 41 మిగిలిపోయాయి. వీటికి తిరిగి నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, ఏఈఎస్ మారయ్యబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోలుగా నియమితులైన అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నియామక ఉత్తర్వులను అందజేశారు. గురువారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో పని చేస్తున్న నలుగురు ఏవోలు, ఆరుగురు డిప్యూటీ ఎంపీడీవోలకు ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ విడుదల చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్, జీ సెక్షన్ ఏవో పూర్ణచంద్రారెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన కేఆర్ఎంబీ చైర్మన్



విజయపురి సౌత్: కృష్ణానది యాజమాన్య బోర్డు చైర్మన్ బీపీ పాండే ఆధ్వర్యంలో సభ్యులు కేకే జాంగిడ్ తదితరులతో కలిసి గురువారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. సాగర్ ప్రధాన డ్యామ్, గ్యాలరీలు, రైట్ కెనాల్, పవర్ హౌస్, ప్రధాన జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. స్వచ్ఛతా హీ సేవ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రాజెక్టు అధికారులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాన డ్యాం, పైలాన్ పిల్లర్ పార్కులను శుభ్రపరిచారు. పార్కులో మొక్కలు నాటారు. శుక్రవారం లో లెవెల్ కెనాల్, లెఫ్ట్ కెనాల్‌లను సందర్శించనున్నారు. కేఆర్ఎంబీ ఈఈ శ్రీనివాసరావు, సాగర్ డ్యాం ఈఈ సీతారాం, డీఈ అశోక్ ఆనంద్, ఏఈ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

జీజీహెచ్ కిటకిట

నగరంలో కోరలు సాచిన డయేరియా

- జీజీహెచ్‌లో 70కి చేరిన బాధితులు
- ఇంకా ఎక్కువే ఉండొచ్చని అనుమానం
- వివరాలు గోప్యంగా ఉంచే ప్రయత్నాలు
- చికిత్స అందిస్తున్న వార్డులో వసతులు కరువు



డయేరియా బాధితులు చికిత్స పొందుతున్న 333వ వార్డు

గుంటూరు మెడికల్: గుంటూరు నగరంలో డయేరియా కోరలు సాచింది. రోజురోజుకూ గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుల సంఖ్య పెరుగుతోంది. బుధవారానికి 30 మందికి పైగా చికిత్స పొందారు. గురువారానికి ఈ సంఖ్య 70కు చేరుకుంది. అయితే, బాధితుల వివరాలను ఆసుపత్రి అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. కేసుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేక వార్డులో సెలైన్ స్టాండ్లు కరువు

డయేరియా బాధితుల కోసం ఆసుపత్రిలో జనరల్ సర్జరీ విభాగంలో 333వ నంబరు గదిని కేటాయించారు. అయితే, రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నా దానికి తగ్గట్టుగా వార్డులో సౌకర్యాలు పెంపొందించలేదన్న విమర్శలు ఉన్నాయి. సెలైన్ స్టాండ్‌లు లేకపోవడంతో మంచాలకు, గోడలకు బాటిళ్లు వేలాడదీస్తున్నారు. గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, ఇతర పార్టీల నేతలు రోగులను పరామర్శించారు. ఈ సమయంలో మంచాలకు, గోడలకు సెలైన్ బాటిళ్లు వేలాడదీసిన దృశ్యాలు కనిపించడంతో ప్రజాప్రతినిధులు సైతం నివ్వెరపోయారు. నిలదీశారు.

లిఫ్టులు పనిచేయక అవస్థలు

ఇన్ పేషెంట్ విభాగంలో లిఫ్టులు పని చేయడం లేదు. దీంతో పలువురు బాధితులు చికిత్స పొందే వార్డుకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ సాధారణ రోగులు సైతం ఇన్‌పేషెంట్ విభాగంలో అడ్మిట్ అయి, చికిత్స పొందేందుకు లిఫ్టులు పనిచేయక యాతన పడుతున్నారు. మూడు రోజులుగా డయేరియా బాధితులు వస్తున్నా మరమ్మతులు చేయించకుండా ఆసుపత్రి అధికారులు మిన్నకుండి పోవడంతో రోగుల బాధలు వర్ణనాతీతంగా మారాయి.

డీఎంహెచ్ఓ పరామర్శ

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులను డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి గురువారం పరామర్శించారు. ఏఏ ప్రాంతాల నుంచి వచ్చారు.. ఆరోగ్యం ఎలా ఉందంటూ ప్రశ్నించారు. చికిత్స పొంది డిశ్చార్జి అయిన ఐదుగురి నివాసాలకు ఆరోగ్య సిబ్బందిని పంపించారు. నీరసంగా ఉన్న వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ వార్డులో చికిత్స పొందుతున్న బాధితులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వార్డులో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశించారు.



లిఫ్టులు పని చేయక రోగిని నడిపించుకు తీసుకెళుతున్న బంధువులు

కంట్రోల్ రూం ఏర్పాటు

జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్ : సీజనల్ వ్యాధుల సమాచారానికి కలెక్టరేట్‌లో 0863- 2234014 నంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా గురువారం తెలిపారు. జిల్లాలో ఏ ప్రాంతంలో అయినా ఆరోగ్య సంబంధిత సమస్యలు, అంటు వ్యాధులు, అతిసార, డెంగీ, మలేరియాలపై తక్షణం కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో డయేరియా కేసుల అంశంపై మాట్లాడుతూ జీజీహెచ్‌లో బుధవారానికి 33 మంది 17 ప్రాంతాల నుంచి చేరారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. వైద్యుల ప్రాథమిక నివేదిక మేరకు ఆహారం కలుషితం వల్లే డయేరియా ప్రబలిందని ఆమె పేర్కొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



బాధితురాలికి చికిత్స చేస్తున్న నర్సులు



రోగి సహాయకులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి. రమణ



సెలైన్లు పెట్టేందుకు స్టాండ్లు లేకపోవడంతో కరెంటు స్విచ్ బోర్డుకు కట్టిన సిబ్బంది

సమష్టి కృషితోనే జిల్లా క్లీన్ అండ్ గ్రీన్

- జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా
- అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు వెస్ట్ : జిల్లాను క్లీన్, గ్రీన్‌గా మార్చుకోవడానికి, జీఎంసీని జాతీయ స్థాయిలో నంబర్ 1 స్థానంలో నిలిపేలా ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా కోరారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా గురువారం గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి హిందూ కాలేజీ కూడలి వరకు స్వచ్ఛతోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహ్మద్ నసీర్, ఏపీ హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా, జీఎంసీ డెప్యూటీ మేయర్ షేక్ సజిలా, జిల్లా, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ప్రతి ఏడాది అక్టోబర్ 2ను స్వచ్ఛ భారత్ దివస్‌గా జరుపుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవ- 2025పై వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, సామాజిక శుభ్రత పాటించడం ద్వారా జిల్లాని స్వచ్ఛంగా తీర్చిదిద్దుకోవడంలో అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆమె కోరారు. ర్యాలీలో పాల్గొన్న వారితో డెప్యూటీ మేయర్ షేక్ సజిలా స్వచ్ఛ ప్రతిజ్ఞ చేపించారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, అధికారులు, కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రీయంగా, సురక్షితంగా పంటల నిల్వకు కృషి

ఏపీఎస్‌డబ్ల్యూసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం. విజయసునీత

గుంటూరు రూరల్: గిడ్డంగి అభివృద్ధి నియంత్రణ సంస్థ (డబ్ల్యూడీఆర్ఏ), సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) సహకారంతో నగర శివారుల్లోని లాంఫాం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం ఔట్‌రిచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిడ్డంగి రిజిస్ట్రేషన్, ఎలక్ట్రానిక్ నెగోషియబుల్ వేర్‌హౌస్ రసీదు, (ఈఎన్‌డబ్ల్యూఆర్) ప్రయోజనాలు, ఫైనాన్సింగ్ తదితర విషయాలను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీఎస్‌డబ్ల్యూసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం. విజయసునీత మాట్లాడుతూ శాస్త్రీయ, సురక్షితమైన నిల్వకు ఏపీఎస్‌డబ్ల్యూసీ నిబద్ధతను వివరించారు. గిడ్డంగి అభివృద్ధి నియంత్రణ సంస్థ సభ్యుడు అరుణ్‌కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ భారతదేశంలో పెరుగుతున్న జనాభా డిమాండ్లను తీర్చేందుకు శాస్త్రీయ పంటకోత తర్వాత నిల్వ, బలమైన గిడ్డంగులు, సమర్థవంతమైన లాజిస్టిక్స్ అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్. శారదజయలక్ష్మీదేవి, సీడబ్ల్యూసీ సభ్యుడు ఆర్.ఆర్.అగర్వాల్, డీఎఫ్‌పీడీ మతేశ్వరి మిశ్రా, ఎస్‌బీఐ ప్రతినిధి కృష్ణకుమార్, యూబీఐ ప్రతినిధి జవహర్ పాల్గొన్నారు.

బాబు పాలనలో అమ్మకానికి విద్యా, వైద్యం

- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి
- 'చలో మెడికల్ కాలేజ్' పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, విద్యార్థి విభాగం నేతలు

పట్నంబజారు: ప్రపంచంలోనే పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసి, ప్రజారోగ్యాన్ని అమ్మకానికి పెట్టిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. పిడుగురాళ్లలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన 'చలో మెడికల్ కాలేజ్ ' పోస్టర్లను గురువారం చంద్రమౌళీనగర్‌లోని ఆయన కార్యాలయంలో పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్లను విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పిడుగురాళ్లలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం నేతలపై ఉందని తెలిపారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో ఇటు విద్య, అటు వైద్యంపేద ప్రజలకు అందని ద్రాక్షలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి ఆధునిక సమాజంలో అత్యంత ప్రాధాన్యం గల విద్య, వైద్యం రెండూ ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు. ఈ వాస్తవం తెలిసిన ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో పెద్ద సంఖ్యలో వైద్యులను తయారు చేసి తద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలన్న సంకల్పంతో రూ. 8,500 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని వివరించారు. పేద విద్యార్థులు కనీసం ఇంగ్లిష్ మీడియంలో చదవడమే పాపంగా భావించే పెత్తందారీ పోకడల చంద్రబాబు, పేదలు డాక్టర్లు కావడం తట్టుకోలేకే ప్రభుత్వ రంగంలో ఉన్న మెడికల్ కళాశాలలను దుర్మార్గంగా ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఏ పాలకుడైనా పోరాడి మరీ మెడికల్ కాలేజీలు సాధించుకుంటారు గానీ.. ఏపీ సీఎం మాత్రం తన హయాంలో ఒక్కటంటే ఒక్క మెడికల్ కాలేజీ కూడా తేలేకపోయారని విమర్శించారు. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా మెడికల్ సీట్లు పెంచమని అడుగుతుంది గానీ ఏపీలో మాత్రం అందుకు విరుద్ధంగా 'మెడికల్ సీట్లు వద్దు.. దయచేసి వాటిని వెనక్కి తీసుకోండి' అని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే కేంద్రానికి లేఖ రాసిందని మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయడం.. ఎంబీబీఎస్ సీట్లకు ఎన్నారై కోటా కింద ఏడాదికి 58 లక్షలు ధర నిర్ణయించడం.. పీపీపీ విధానం అంటూ అన్ని వ్యవస్థలను ప్రైవేటుకు అమ్ముకోవడమే చంద్రబాబు విజన్ అని అప్పిరెడ్డి ధ్వజమెత్తారు. పేదవాడు డబ్బులకు ఇబ్బంది పడకుండా వైద్యం అందాలన్న జగన్ సంకల్పానికి తూట్లు పొడవకుండా ఉంటే చాలని ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థులను వైద్య విద్యకు, పేద ప్రజలను వైద్య సేవకు దూరం చేసే కుట్రలు, కుతంత్రాలకు తక్షణమే స్వస్తి పలకాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉగ్రరూపం దాలుస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాపతోటి అంబేడ్కర్, దూపాటి వంశీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, రవి, బాజీ, గోపీ, కోటి, భరద్వాజ్, బాలు, మస్తాన్, అజయ్ పాల్గొన్నారు.

పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో జూలైలో జరిగిన పీజీ కోర్సుల 2వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు గురువారం విడుదల చేశారు. ఎంఏ కోర్సుల్లో ఉర్దూ, సంస్కృతం, రూరల్ డెవలప్‌మెంట్, టూరిజం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల ఫలితాలు విడుదల చేశారు. రీవాల్యూయేషన్‌కు ఈనెల 29లోగా ఒక్కో పేపర్‌కు రూ. 860 చెల్లించాలని సీఈ ఆలపాటి సూచించారు. ఎంఎస్సీ ఒకేషనల్ కోర్సుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, హార్టీ కల్చరల్ ల్యాండ్ స్కేప్, ఎంఎస్సీలో జియాలజీ, నానో బయో టెక్నాలజీ, మేథమాటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఆక్వా కల్చర్, మైక్రోబయాలజీ, ఎలక్ట్రానిక్స్ కోర్సుల ఫలితాలు విడుదల చేశారు. వీటిల్లో రీవాల్యూయేషన్‌కు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆలపాటి సూచించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,100 గరిష్ఠం : రూ. 3,000

మోడల్ ధర రూ. 2,600

పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 446

కొమ్ములు : 312 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,300	10,450	10,450

కాయలు : 154 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,300	10,450	10,450

మొత్తం అమ్మకాలు : 349.50 క్వింటాళ్లు

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	38,332
అమ్మకాలు	40,148
నిల్వ	8,265



నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,500
నంబరు–5	10,000–13,800
273	10,500–13,300
341	10,000–15,300
సూపర్ –10	11,500–14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,600
341	10,000–15,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,700
బాడిగ–355	10,000 – 15,500
దేవనూరు డీలక్స్	10,000 – 14,000
ఆర్మూర్	9,800 – 12,300
తాలుకాయలు	6,200 – 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,800
బాడిగ – 355	10,000–15,400
దేవనూరు డీలక్స్	10,000–14,000
తాలు	5,200 – 7,200

–కొరిటెపాడు (గుంటూరు)

ఎనిమిది మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలోని ఎనిమిది మండలాల్లో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు వర్షం పడింది. అత్యధికంగా పెదనందిపాడు మండలంలో 15.6 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా తుళ్లూరు మండలంలో 1.8 మి.మీ. పడింది. సగటున 4.1 మి.మీ. కురిసింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళగిరి మండలంలో 9.8 మి.మీ., తాడికొండ 9.6, కాకుమాను 9.4, చేబ్రోలు 9.2, గుంటూరు పశ్చిమ 9.2, తాడేపల్లి మండలంలో 8.4 మి.మీ. చొప్పున పడింది.

వైద్య విద్యను అమ్ముకుంటున్న బాబు



గుంటూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన విభాగం నేతలు



తెనాలిలో పోస్టరు ఆవిష్కరిస్తున్న విద్యార్థి విభాగం నేతలు

- 'చలో మెడికల్ కాలేజ్'ను జయప్రదం చేయండి
- వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం నేతల పిలుపు
- నేడు పిడుగురాళ్లలో నిర్వహణ

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించ తలపెట్టిన చలో మెడికల్ కాలేజ్ (పిడుగురాళ్ల) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం నేతలు పిలుపునిచ్చారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు వైద్య విద్యను పేదలకు వైద్యాన్ని సమూలంగా సదూరం చేసేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. దీనిపై బాధ్యత గల యువజన, విద్యార్థి సంఘాలుగా ప్రభుత్వ విధానాలపై ప్రతిఘటిస్తామని తెలిపారు. మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేసి.. కోట్లాది రూపాయాల ప్రభుత్వ ఆస్తులను వాళ్ల వారికి ధారాదత్తం చేసేందుకు యోచిస్తున్నారని మండిపడ్డారు. కచ్చితంగా ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఎంతటి పోరాటాలకైనా వెనుకాడబోమని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం నేతలు కళ్లం హరికృష్ణారెడ్డి, కోటేశ్వరరావుయాదవ్, అనిల్‌రెడ్డి, షేక్ సుభాని, శశిధర్, జగదీష్, రవి, భానుప్రకాష్ పాల్గొన్నారు.

తెనాలిలో...

ప్రభుత్వ వ్యయంతో నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడం పేదలకు వైద్య విద్యను దూరం చేయటమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు కోటయ్య అన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. శుక్రవారం (నేడు) నిర్వహించ తలపెట్టిన 'చలో మెడికల్ కాలేజ్ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల' కార్యక్రమ పోస్టర్‌ను గురువారం స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం కోటయ్య విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ రంగంలోని మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే, పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరం అవుతుందని తెలిపారు. తెనాలి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పల్లె రోహిత్ శామ్యూల్ మాట్లాడుతూ స్వార్థ ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే ప్రభుత్వ తీరును నిరసించేందుకు యువజనులు, విద్యార్థులు ముందుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ రూరల్ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు నూకతోటి అభిషేక్, కొల్లిపర మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు దరిశి రవితేజ, రాష్ట, జిల్లా విద్యార్థి నాయకులు మధిర రవితేజ, పాటిబండ్ల హోసన్న, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మంచాల సుకుమార్, స్థానిక విద్యార్థి నాయకులు దిడ్ల సునీల్, చొక్కా సంపత్, మన్నవ ప్రదీప్, కోడూరి నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు యాతాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు, పార్టీ నాయకుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

తురకపాలెంలో జెడ్పీ చైర్‌పర్సన్ పర్యటన

గుంటూరు రూరల్: తురకపాలెం ప్రజలు ఆందోళన చెందవద్దని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. అధికారులతో కలిసి గురువారం ఆమె సందర్శించారు. గ్రామంలో సంభవించిన మరణాలపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటువంటి మరణాలు సంభవించకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ కె. విజయలక్ష్మి, డీపీఓ నాగసాయికుమార్ , డెప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

కౌలు రైతులకు చట్టమే ఆటంకం

రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వటానికి గత ప్రభుత్వం తెచ్చిన చట్టమే ఆటంకంగా ఉందని రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డు తీసుకోవాలంటే దరఖాస్తు ఫారంలో భూ యజమాని సంతకం ఉండాలనే నిబంధన విధించడం వల్ల గుర్తింపు కార్డు దక్కట్లేదని తెలిపారు. గుంటూరు కొరిటెపాడు రామన్నపేటలోని జనచైతన్య వేదిక హాలులో మంగళవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ 2011 కౌలుదార్ల చట్టాన్ని సవరించి, గత ప్రభుత్వం 2019లో తెచ్చిన చట్టంతో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు దక్కటమే గగనమైందని తెలిపారు. ఈ చట్టాన్ని సవరిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన టీడీపీ గెలిచాక సవరణ ముసాయిదాపై ప్రాంతీయ సదస్సులు ఏర్పాటు చేసి, ఇప్పుడు ఆ విషయాన్ని పక్కన పడేశారని తెలిపారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతుల సమస్య నేడు దేశంలో చాలా పెద్దదని, వారి సంక్షేమాన్ని పట్టించుకోకపోతే అశాంతి, అలజడి పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాలరావు , డీబీఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్, కిసాన్ ఫౌండేషన్ నాయకులు సూరయ్య చంద్ర, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు తదితరులు ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరావు

గంజాయి తాగుతున్న యువకుల అరెస్టు

మహిళ పరారీలో ఉన్నట్లు సమాచారం

తాడేపల్లి రూరల్: కృష్ణానది తీరంలో గంజాయి తాగుతున్న తొమ్మిది మంది యువకులను తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. సీఐ వీరేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం పాతూరు కరకట్ట వద్ద కొంత మంది యువకులు గంజాయి తాగుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ ప్రతాప్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి తనిఖీ చేశారు. తొమ్మిది మంది వద్ద 810 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అరెస్టు చేసిన వారిలో బండిరెడ్డి అనిల్ అలియాస్ చిన్నబాలు, సయ్యద్ మీరా అహ్మద్, దుగ్గిరాల సాయికుమార్, తుమ్మల దుర్గా మల్లికార్జునరెడ్డి, యర్లగడ్డ గోవర్ధన్‌రావు, ఎస్.మనోజ్, మాదాసు నాగార్జున, శ్రీకాంత్, బి.ప్రసాద్ ఉన్నట్లు వివరించారు. ఎవరైనా గంజాయి తాగుతున్నా, విక్రయించినా వెంటనే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా ఉండవల్లి సెంటర్‌లో మరో మహిళ గంజాయి విక్రయిస్తున్నట్లు నిందితులు చెప్పడంతో పోలీసులు అక్కడ 350 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే, సదరు మహిళ పరారీలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్
- జిల్లా కలెక్టర్‌కు ఉద్యమ కార్యాచరణ నోటీసు

గుంటూరు వెస్ట్: విపరీతమైన పనిభారంతో పాటు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఉద్యమ కార్యాచరణ నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సర్వే విధుల నుంచి విముక్తి కలిగించి మాతృ శాఖలకు అప్పగించాలని విన్నవించారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, బకాయిలు ఇప్పించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు అప్‌గ్రేడ్ చేయాలని, స్పష్టమైన సర్వీస్ రూల్స్ రూపొందించి పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బదిలీలకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలతో జీవో ఇవ్వాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో కోశాధికారి ధనలక్ష్మి, వైస్ చైర్మన్ మధులత, మరియదాసు, జేఏసీ నాయకులు మధు, సతీష్, మహేష్, రాజారావు, బాషా, హిదాయత్, పవన్, ప్రసాద్, భరత్, సరోజిని, దీప్తి, ప్రశాంతి, గీత పావని, రాధిక పాల్గొన్నారు.

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి

జిల్లాలో గుర్తింపు పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం నాయకులతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ సంఘ నాయకులతో కలసి జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. చాలా కాలం నుంచి సమావేశం నిర్వహించలేదని, సమస్యలు చెప్పుకునే అవకాశం తమకు రాలేదని పేర్కొన్నారు. తాము ప్రభుత్వంతో కలిసి ప్రజలకు ఉత్తమ సేవలందించేందుకు ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. న్యాయమైన తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లా షాఖాద్రి, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోటా సాహెబ్, జిల్లా కోశాధికారి పోతురాజు, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి సుమిత్రాదేవి, షబానా, అరుణ కుమారి, రమణి పాల్గొన్నారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు నోటీసు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రతిజ్ఞ చేస్తున్న డైరెక్టర్ అహెంతమ్ శాంత సింగ్ తదితరులు



ప్రతిజ్ఞ చేస్తున్న మెడికల్ విద్యార్థులు

మంగళగిరి: మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వడం వల్ల ఆత్మహత్యలను నివారించవచ్చని ఎయిమ్స్ ప్రొఫెసర్, డైరెక్టర్ డాక్టర్ అహెంతమ్ శాంత సింగ్ తెలిపారు. నగర పరిధిలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ముగింపు సందర్భంగా డాక్టర్ అహెంతమ్ శాంత సింగ్ మాట్లాడుతూ ఆత్మహత్యల నివారణకు హెల్ప్ లైన్ నంబర్ 7331115179ను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం, సృజనాత్మకత, విమర్శనాత్మకత ప్రోత్సహించే విధంగా పెయింటింగ్, వక్తృత్వం పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ అధికారులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్‌లో పడి వ్యక్తి గల్లంతు

కాజ(మంగళగిరి): గుంటూరు చానల్‌లో పడి వ్యక్తి గల్లంతైన ఘటన మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు గురువారం తెలిపిన వివరాల మేరకు... కాజ గ్రామానికి చెందిన దొడ్డక రాంబాబు(40) పొలానికి వెళ్లి వస్తూ ప్రమాదవశాత్తూ గుంటూరు చానల్‌పై ఉన్న వంతెన మీద నుంచి కాలువలో పడి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ వెంకట్ ఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకుని, గాలింపు చర్యలు చేపట్టారు.వంతెన శిథిలావస్థకు చేరడంతో పాటు ఇరువైపులా ప్రహరీ గోడ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు స్థానికులు తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాంబాబు భార్య ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తుండగా, ఇద్దరు పిల్లలున్నారని స్థానికులు తెలిపారు.



కాలువను పరిశీలిస్తున్న రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు

అతిసారం.. ప్రాణాంతకం

- కలుషిత నీరు, ఆహారంతో వ్యాప్తి
- అశ్రద్ధ చేస్తే ప్రాణాలకు ముప్పు

గుంటూరు మెడికల్: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల్లో అతిసారం (డయేరియా) ముఖ్యమైంది. సకాలంలో వైద్యం చేయించని పక్షంలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. గుంటూరు నగరంలో మంగళ, బుధవారాల్లో 25 మంది వ్యాధి బారిన పడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఏటా వర్షాకాలంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అతిసార వ్యాధి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. గత ఏడాది గుంటూరు నగరం శారదా కాలనీలో 326 కేసులు నమోదు కాగా, ఒకరు చికిత్స పొందుతూ చనిపోయారు. చేబ్రోలు పీహెచ్‌సీ పరిధిలోని మంచాల గ్రామంలో 62 డయేరియా కేసులు నమోదయ్యాయి. ఇటీవల నగరంలో కేసులు వస్తున్న నేపథ్యంలో వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం



గుంటూరు జీజీహెచ్‌లో డయేరియా వార్డు

వ్యాధి సోకడానికి కారణాలు

విరోచనాలు నీళ్లగా, పలచగా అవుతుంటే డయేరియా(అతిసార వ్యాధి) అంటారు. వైద్య పరిభాషలో దీన్ని గ్యాస్ట్రో ఎంటిరైటిస్‌గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణవ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరేచనాలు నూటికి 70శాతం వైరస్ క్రిముల వల్ల వస్తాయి. కలుషితమైన నీటిని తాగడం వల్ల, మలం మీద వాలిన ఈగలు ఆహార పదార్థాలపై వాలిన తర్వాత తినడం ద్వారా వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలవుతాయి.

పిల్లలకు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి

డయేరియా వల్ల పెద్దవారికంటే పిల్లలకు ఎక్కువగా ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తాయి. దాహం పెరిగితే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలి. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో వీటిని ఉచితంగా అందిస్తారు. ఒక ప్యాకెట్ పౌడర్‌ను లీటర్ నీటిలో కలిపి పిల్లలతో తాగించాలి. విరోచనాలు అయ్యేవారికి కారం, మసాలావంటి ఘాటు పదార్థాలు పెట్టకూడదు. డయేరియా తగ్గే వరకు వైద్యుల సలహా ప్రకారం మందులు, ఆహారం అందించాలి.

లక్షణాలు ఇవి...

- జీర్ణవ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా ఉండి వాంతులు, విరేచనాలు నీళ్ల, నీళ్లగా అవుతాయి.
- కడుపులో మెలిపెట్టినట్లు నొప్పి ఉంటుంది.
- నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కల నొప్పులు వస్తాయి.
- మనం తాగే నీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది.
- డీహైడ్రేషన్‌లో నాడి వేగంగా లేదా బలహీనంగా కొట్టుకోవడం లేదా ఒక్కోసారి అసలు తెలియపోవడం ఉంటుంది.
- నీరసం, నోరు, నాలుక, పిడచకట్టుకుపోవడం, శరీరం ఎండిపోవడం, ఒక్కోసారి మూత్రం అసలు రాకపోవటం లేదా చాలా తక్కువగా రావటం లేదా ముదురు పసుపు రంగులో వస్తుంది.
- వయస్సుతో సంబంధం లేకుండా డీహైడ్రేషన్ వస్తుంది. దీనివల్ల పిల్లలకు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం.

కాచి చల్లార్చిన నీరు తాగాలి



డయేరియా సోకిన వారికి ద్రవ రూపంలో ఉండే ఆహారం అందజేయాలి. మజ్జిగ, పాలు, బార్లీ గంజి, పలచగా తయారు చేసిన సగ్గు బియ్యం, రాగి జావ, కొబ్బరి నీళ్ల, నిమ్మరసం, సోయాబీన్స్ రసం, ఇతర పళ్ల రసాలు ఇవ్వొచ్చు. మలమూత్ర విసర్జన పిదప, భోజనం చేసే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం చాలా ఉత్తమం. ఇంట్లో వైద్యాలు, మందుల షాపుల వద్దకు వెళ్లి మందులు తెచ్చుకోవడం చేయవద్దు. డయేరియా వచ్చినప్పుడు అర్హత ఉన్న వైద్య నిపుణుడి వద్దకు వెళ్లాలి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

ఉచితంగా వైద్య సేవలు



వర్షాకాలంలో కేసులు నమోదయ్యే దృష్ట్యా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. బాధితులకు చికిత్స అందించేందుకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు, సెలైన్లు, అన్ని అందుబాటులో ఉంచాం. డయేరియా సోకిన ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. ముందస్తుగా గుర్తించి నివారణ చర్యల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అతిసార వ్యాధి బాధితులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాం.

–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి , డీఎంహెచ్ఓ, గుంటూరు